11 లోపు పది పరీక్షల రుసుం చెల్లించాలి

బాపట్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 28 నుంచి నవంబరు 11 లోగా రుసుం చెల్లించాలని డీఈవో కె.నారాయణరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ రూ.50ల ఆలస్య ఫీజుతో కలిపి నవంబరు 18 వరకు చెల్లించటానికి అవకాశం ఉందన్నారు. రూ.200 ఆలస్య ఫీజుతో నవంబరు 25 వరకు, రూ.500 ఆలస్య ఫీజుతో నవంబరు 30 లోగా పబ్లిక్ పరీక్షల రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు అదనంగా రూ.60లు చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. సప్లిమెంటరీ విద్యార్థులు మూడు సబ్జెక్టులకు రూ.110, వయస్సు తక్కువ ఉన్న విద్యార్థులకు రూ.300ల చొప్పున రుసుం చెల్లించాలని ఆయన తెలిపారు.


బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: దీపావళి బాణసంచా విక్రయించే దుకాణాలు, తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోదాములకు అనుమతి తప్పనిసరి అని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలన్నారు. పాటించనివారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో బాణసంచా దుకాణాలు, తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోదాములు ఉండాలని తెలిపారు. అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. మండే స్వభావం ఉన్న పెట్రోలు, అగ్గి పెట్టెలు, ఇతర వస్తువులను అనుమతించరాదన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేయాలని చెప్పారు. దుకాణాల మధ్య నిర్దిష్ట దూరం ఉండాలని పేర్కొన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి విక్రయించాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా ఎవరైనా తయారు చేసినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈనాడు
బాపట్ల
శనివారం అక్టోబరు 26, 2024

ఉపాధి హామీ పథకం అమలు భేష్


వెల్లలచెరువు గ్రామ సచివాలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణ బృందం అధికారులు

వెల్లలచెరువు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అమలవుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణ బృందం అధికారులు పి.లోహిత్‌రెడ్డి, ఎన్.శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. సంతమాగులూరు మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ, మహిళా సంఘాల పనితీరును పరిశీలించేందుకు బృంద సభ్యులు మండలంలోని మక్కెనవారిపాలెం, వెల్లలచెరువు, అడవిపాలెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ పథకాల ద్వారా ప్రభుత్వం పూర్తి చేసిన, చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, మండల స్థాయి అధికారులు, సిబ్బందితో చర్చించారు. పథకాల పనితీరును చూశారు. గ్రామ సభల్లో మహిళలు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన ఉపాధి హామీ పథకాలతోపాటు ప్రజలకు అవసరమైన, వారికి మేలు చేకూర్చే పనులను ఈ పథకంలో సమ్మిళితం చేసేందుకు సూచించాలని స్థానికులను కోరారు. ప్రత్యేకించి అటవీ, ఉద్యాన, వ్యవసాయ శాఖల సంయుక్తంగా క్షేత్రస్థాయిలోని ప్రభుత్వ శాఖలన్నింటినీ అనుసంధానించి గ్రామీణాభివృద్ధికి మెరుగైన బాటలు వేసే పథకాల రూపకల్పనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పరిశీలనలో భాగంగా వెల్లలచెరువు సచివాలయ ప్రాంగణంతోపాటు మిగతా చోట్ల మొక్కలు నాటారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, స్థానిక ప్రజా ప్రతినిధి ఆలూరి శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం హనుమంతరావు, పీఆర్ఏఈ నాగేశ్వరరావు, ఎంఈవో వి.కోటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో సురేష్, స్థానిక తెదేపా నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు.. మొక్కుబడేనా!

జిల్లాలో మొక్కలు నాటే ప్రక్రియ లక్ష్యానికి ఆమడదూరంలో ఉంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబరు వరకు మొత్తం 20 లక్షలు నాటాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు కేవలం 3.5 లక్షలు మాత్రమే నాటారు. మరో 35 రోజుల్లో 16.5 లక్షలు నాటడం అసాధ్యంగా కనిపిస్తోంది. నర్సరీల్లో మొక్కలు అందుబాటులో లేవు.

- ✦ లక్ష్యానికి దూరంగా నాటే ప్రక్రియ
- ✦ బాపట్ల జిలాల్లో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే, బాపట్ల


నర్సరీలో జీడిమామిడి మొక్కలు

పర్యావరణ సమతుల్యత కోసం 33.33 శాతం విస్తీర్ణంలో పచ్చదనం ఉండాలి. జిల్లాలో 20 శాతం విస్తీర్ణంలో మాత్రమే అడవులు, పచ్చదనం ఉన్నాయి. సూర్యలంక మార్గంలోని నగరవనంలో ఆగస్టు 30న వన మహోత్సవం నిర్వహించారు. కలెక్టర్ వెంకట మురళి, జిల్లా అధికారులు మొక్కలు నాటారు. జిల్లాలో 20 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని ప్రకటించారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరులో లక్ష్యం పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పండ్ల మొక్కలు నాటడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ స్థలాలు కార్యాలయాలు, రహదారులు, పంట కాలువల వెంబడి, అటవీ ప్రాంతాలు, ప్రైవేటు స్థలాల్లో మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించారు.

గడువులోపు పూర్తయ్యేనా..

☛ అటవీశాఖకు చెందిన ముత్తాయపాలెం, రామన్నపేట, ముప్పవరం నర్సరీల ద్వారా 2.25 లక్షల మొక్కలు పంపిణీ చేశారు. వీటిలో ఎక్కువగా నీడనిచ్చే మొక్కలు ఉన్నాయి. చినగంజాం మండలంలో డ్వామా నర్సరీ ద్వారా మరో 50 వేల మొక్కలు రహదారులు, కాలువల వెంబడి ఉపాధి హామీ పథకం కింద కూలీలతో నాటించారు. విద్యార్థులు, అధికారులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ద్వారా మరో ఐదు వేల మొక్కలు నాటారు. 550 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు కింద మామిడి, సపోటా, జామ, జీడి మామిడి, నిమ్మ మొక్కలు ఏడు వేలు నాటారు. బయట నర్సరీల నుంచి తెచ్చి నాటిన మొక్కలు సైతం 50 వేల లోపే ఉన్నాయి. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం కింద కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లో మొక్కలు నాటారు. అన్ని కలిపినా గత రెండు నెలల్లో 3.5 లక్షలు మించలేదు. మరో 35 రోజుల్లో సమయం ముగుస్తుంది. అప్పటికి మరో లక్షన్నర మొక్కలకు మించి నాటే పరిస్థితి కానరావడం లేదు. కాలువల గట్లు, రహదారుల వెంబడి తక్కువ మొక్కలు నాటారు.

గత ప్రభుత్వం తీరుతో..

☛ జిల్లాలో అటవీ భూములు, బంజరు భూములు చాలా ఉన్నాయి. వీటిలో లక్షల సంఖ్యలో మొక్కలు నాటడానికి అవకాశం ఉంది. అయితే స్థానిక అటవీశాఖ, డ్వామా నర్సరీల్లో మొక్కలు అందుబాటులో లేవు. నర్సరీల్లో మొక్కలు పెంపకానికి గత వైకాపా ప్రభుత్వం తగినంత నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. ఆ ప్రభావం నర్సరీల్లో మొక్కల ఉత్పత్తిపై పడింది. అటవీశాఖ, డ్వామా నర్సరీల నుంచే 15 లక్షలకు పైగా మొక్కలు ఉత్పత్తి చేయటానికి అవకాశం ఉంది. కడియం నర్సరీలు, స్థానిక ప్రైవేటు నర్సరీల నుంచి పెద్దసంఖ్యలో పండ్ల, పూల మొక్కలు తెప్పించటానికి అవకాశాలు ఉన్నాయి. నవంబరులో వనసమారాధన సమయంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసి ప్రజలను భాగస్వాములను చేస్తే లక్ష్యంలో సగమైనా పూర్తవుతుంది.

నర్సరీల్లో ఉన్నవి పంపిణీ చేశాం

నర్సరీల్లో ఉన్న మొక్కలు తెప్పించి అటవీ భూముల్లో నాటడంతో పాటు మండలాల్లో పంపిణీ చేశాం. అదనంగా మొక్కలు తెప్పించి నాటిస్తాం. బాపట్ల, చీరాల నగర వనాలను త్వరలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రారంభిస్తాం.
- భీమయ్య, జిల్లా అటవీశాఖాధికారి

పండ్ల మొక్కలు ఇస్తున్నాం

ఉపాధి హామీ, ఉద్యాన పంటల సాగు కింద పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తున్నాం. కడియం నర్సరీల నుంచి రైతులు కోరుకున్న పండ్ల మొక్కలు తెప్పించి ఉచితంగా అందజేస్తున్నాం. రహదారులు, కాలువ గట్లపై లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటాం. **- సువార్త, డ్వామా ఏపీడీ**

మాతృ మరణాలు పూర్తిగా అరికట్టాలి


మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో మాతా శిశు మరణాలు పూర్తిగా అరికట్టాలని జేసీ ప్రఖర్‌జైన్ అన్నారు. కలెక్టరేట్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత మూడు నెలల్లో ఏడు మాతృ మరణాలు నమోదు కావటంపై ఆరా తీశారు. మరణాలకు కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనత నివారణతో మాతృమరణాలు పూర్తిస్థాయిలో అరికట్టవచ్చన్నారు. గర్భిణుల వివరాలు దస్త్రాల్లో నమోదు చేసి వారికి నిరంతరం వైద్య పరీక్షలు చేయించి, పోషకాహారం తీసుకునేలా చూడాలన్నారు. రక్తహీనత సమస్య ఉన్న వారిని ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, డీసీహెచ్ఎస్ శేషుబాబు, వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు అండర్ పాస్‌లు

మార్టూరు: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ఎన్.హెచ్.ఎ.ఐ దృష్టి సారించింది. డేగరమూడి-రాజుపాలెం కూడలి, జొన్నతాళి కూడలి వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు హైవే అధికారులు రెండు అండర్‌పాస్‌లు నిర్మించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా సంబంధిత గుత్తేదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని బొల్లాపల్లి టోల్‌ప్లాజా మేనేజర్ కిరణ్‌కుమార్, ఈ సమస్యపై పోరాడిన ఏలూరి కృష్ణమూర్తి ఉత్తర్వులను శుక్రవారం చూపారు. సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి


ప్రసంగిస్తున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త సంచాలకుడు కేశవరెడ్డి

బాపట్ల: పంచాయతీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త సంచాలకుడు ఆర్.కేశవరెడ్డి అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో జిల్లా అధికారులు, ఆర్పీలకు రెండురోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు సక్రమంగా తయారు చేయకపోవటం, ఆన్‌లైన్లో ఆడిట్ జరగకపోవటం వల్ల 474 గ్రామ పంచాయతీలు, 27 మండల పరిషత్తులు, నాలుగు జిల్లా పరిషత్తులకు కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. దీని వల్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో పని చేస్తున్న క్లాప్ మిత్రలకు వేతనాలు చెల్లించలేక పోయినట్లు పేర్కొన్నారు. ప్రగతి ప్రణాళికల రూపకల్పనలో తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సంయుక్త సంచాలకుడు జె.రామనాధం, కోర్సు సంచాలకుడు కె.శ్రీనివాసరావు, ఆర్పీ ఎంవీ సుబ్బారావు, కన్సల్టెంట్లు కె.మోహనరావు, డి.ఏడుకొండలు పాల్గొన్నారు.

జనవరి ఒకటి నుంచి సూర్యలంక బీచ్‌లో ప్రవేశానికి రుసుం

బాపట్ల, న్యూస్‌టుడే: జనవరి ఒకటి నుంచి సూర్యలంక బీచ్‌లో ప్రవేశానికి రూ.20 రుసుం వసూలు చేయనున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పురపాలక కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సముద్ర తీరం వద్ద ఫెన్సింగ్ వేసి మూడు గేట్ల ద్వారా పర్యాటకులను బీచ్‌లోకి అనుమతిస్తామన్నారు. బీచ్‌లో మౌలిక వసతుల కల్పన కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

దంపతులకు ఉపాధి కల్పిస్తే.. ఊడ్చేశారు!

పెట్రోలు బంకు యజమానుల్ని మోసగించిన మేనేజర్లపై కేసు

అద్దంకి, న్యూస్‌టుడే: పెట్రోలు బంకు మేనేజర్లుగా పనిచేస్తున్న దంపతులిద్దరూ యజమానులకు తెలియకుండా అమ్మకం సొమ్ములు సొంతానికి వాడుకున్నారు. ప్రశ్నించినందుకు చంపేస్తామని బెదిరిస్తూ దాడికి యత్నించారు. ఈ సంఘటనపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ పి.కృష్ణయ్య అందించిన సమాచారం మేరకు.. గుంటూరు పట్టణం దేవపురానికి చెందిన జెల్ది అనిల్‌కుమార్, గార్లపాటి రంజిత్‌కుమార్‌లు అద్దంకి ఎన్టీఆర్‌నగర్‌లో మూడేళ్ల క్రితం 'గార్లపాటి పెట్రోలియమ్స్' పేరుతో పెట్రోలు బంకు ప్రారంభించారు. పరిచయస్తుల సూచన మేరకు ప్రకాశం జిల్లా చీమకుర్తి అంబేడ్కర్ నగర్‌కు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు, ఆయన భార్య మల్లీశ్వరిలను మేనేజర్లుగా నియమించుకున్నారు. నెలకు రూ.8 వేల చొప్పున జీతం ఇచ్చేవిధంగా అంగీకరించారు. యజమానులిద్దరూ వృత్తి రీత్యా దక్షిణాఫ్రికాలో నివసిస్తున్నారు. ఏడాదికొక పర్యాయం అద్దంకి వచ్చి లెక్కలు చూసుకుని వెళుతున్నారు. రెండేళ్ల పాటు వ్యాపారం సాఫీగా సాగింది. వారం రోజుల క్రితం పెట్రోలు బంకు వద్దకు వచ్చిన యజమానులు నిర్ఘాంతపోయారు. మేనేజర్లుగా ఉన్న ఇద్దరు దంపతులు అందుబాటులో లేరు. గత నాలుగు నెలల నుంచి పెట్రోలు ఉత్పత్తుల అమ్మకాలకు సంబంధించిన డబ్బులు రూ.30 లక్షలు ఫోన్‌పే ద్వారా వారి ఖాతాకు జమ చేసుకున్నారు. వీటితో పాటు అనిల్‌కుమార్ ఇచ్చిన రూ.నాలుగు లక్షలు వెరసి రూ.34 లక్షలు వారి నుంచి రావాల్సి ఉంది. ఆమేరకు యజమానులు చీమకుర్తిలోని దంపతుల ఇంటికి వెళ్లి చూడగా రెండంతస్తుల భవనం, కారు, బైకు, మూడు చరవాణిలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు మరోసారి తమ ఇంటికి వస్తే చంపేస్తామంటూ బెదిరించి, దాడికి ప్రయత్నించారు. ఆమేరకు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

అధిక రసాయనాలతో దిగుబడి పతనం

గుంటూరు: పంటల సేద్యంలో రైతులు అధిక ఎరువులు, రసాయన మందులు వినియోగించడంతో పంటల దిగుబడి తగ్గడంతో పాటు భూమి సారం కోల్పోతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఏడీఆర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. గుంటూరుకు సమీపంలోని లాంఫాం ఆడిటోరియంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యం అంశంపై ఆంగ్రూ-గుంటూరు ఏరువాక కేంద్రం, సమేటి, మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమేటి రాష్ట్ర కార్యాలయం ఏడీఏ పుణ్యవతి, తదితరులు ఎరువుల వినియోగంపై మాట్లాడారు.

గుండ్లకమ్మ నదీ గర్భానికి తూట్లు

ఊటబావులు, వంతెనలు సమీపంలోనే అక్రమంగా ఇసుక తవ్వకాలు

న్యూస్‌టుడే, బాపట్ల

భవన నిర్మాణ రంగంలో ఇసుకకు డిమాండ్ ఉంది. ప్రభుత్వ డంప్ యార్డుల్లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేదు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఇసుక కొరత ఏర్పడింది. జిల్లాలో కృష్ణా నదిలో కొల్లూరు మండలంలోని గాజుల్లంక, జువ్వలపాలెం రేవుల్లో ఈ నెల 16 నుంచి తవ్వకాలు చేపట్టడానికి గనుల శాఖ టెండర్లు పిలిచింది. నదిలో నీటి ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో తవ్వకాలకు పరిస్థితులు అనుకూలంగా లేవు. నవంబరు మొదటి వారం నుంచి మనుషుల ద్వారా తవ్వకాలు చేపడదామన్నా నదిలో నీటి ప్రవాహం తగ్గకపోతే సాధ్యమయ్యేలా లేదు. ఈ క్రమంలో డంప్ యార్డుల ద్వారా ఇసుక అందుబాటులోకి రావటానికి చాలా సమయం పట్టేలా ఉంది. అలాగే గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలకు రేవులు ఇంకా గుర్తించలేదు.

☛ నదులు, వాగులు, వంకల్లో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా సొంత అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్లే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు గనుల శాఖ ఆదేశాలు జారీ చేసింది. పట్టా భూముల్లో తవ్వకాలకు సైతం అనుమతి ఇచ్చింది. జిల్లా ఇసుక కమిటీ ద్వారా పట్టా భూముల్లో తవ్వకాలకు అనుమతులు జారీ చేస్తున్నారు. వ్యక్తిగత అవసరాలకు ఇసుక తవ్వి తీసుకెళ్లటానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని కొందరు నేతలు తమ అక్రమార్జనకు అవకాశంగా మార్చుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణానికి తూట్లు పొడుస్తూ నది గర్భంలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకొంటున్నారు.

గుండ్లకమ్మ నదీ గర్భానికి కొందరు తూట్లు పొడుస్తున్నారు. అద్దంకి మండలంలో నదీ పరివాహక ప్రాంతంలో యంత్రాలతో పగలు, రాత్రులు తేడా లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేసి ట్రక్కుకు రూ.3500 చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులతో కూడిన మండల స్థాయి కమిటీలు అడ్డుకోవటం లేదు.


గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వుతున్న జేసీబీ

☛ అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది పరివాహకంలో ఓ నేత అండగా అనుచరులు భారీగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. నదిలో వర్షపునీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో పరివాహకంలో ఇసుక తవ్వకాలు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తెర వెనుక మంత్రాంగం నడిపే నేతలు యంత్రాలతో పనికానిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చినప్పటికీ నిర్దేశించిన రీచ్‌ల్లో మాత్రమే తవ్వకాలు జరపాలి. అయితే ఎలాంటి అధికారిక రీచ్‌లు లేని గుండ్లకమ్మ నది పరివాహకంలో ఇసుక తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. అద్దంకి, రామాయపాలెం రెవెన్యూ పరిధిలో పొక్లెయిన్‌తో తవ్వడం, ట్రాక్టర్‌లలో తరలించడం పరిపాటిగా మారింది. మూడు టన్నుల ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ధర రూ.3,500ల చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అద్దంకి పురపాలక సంఘానికి గుండ్లకమ్మ నదిలో ఊట బావుల ద్వారా నీరు సరఫరా అవుతోంది. ఊటబావుల సమీపంలో అక్రమ తవ్వకాల వల్ల నీటి లభ్యత తగ్గిపోయి అద్దంకి పట్టణానికి భవిష్యత్తులో తాగునీటి సమస్య తీవ్రమవుతుందని పర్యావరణహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

సామాన్య ప్రజలు వ్యక్తిగత అవసరాలకు మాత్రమే ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నదిలో యంత్రాలతో తవ్వకాలు చేపట్టడానికి అనుమతి లేదు. అక్రమ తవ్వకాలు అడ్డుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గనుల, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశిస్తా. **- ప్రఖర్‌జైన్, జేసీ**

మిర్చియార్డు ప్రక్షాళన దిశగా చర్యలు

- ❖ పర్సన్ ఇన్‌ఛార్జిగా సంయుక్త కలెక్టర్ భార్గవతేజ
- ❖ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

గుంటూరు, న్యూస్‌టుడే

గత అయిదేళ్ల వైకాపా హయాంలో గుంటూరు మిర్చియార్డులో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ సాగుతోంది. ఇది ముగియగానే మార్కెటింగ్ శాఖ విచారణ ప్రారంభం కానుంది. విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్ మిర్చియార్డులో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఇదిలా ఉంటే మిర్చియార్డులో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేసి ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవతేజను పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిమిత్తం నియమించిన గ్రూపు సభ్యుల్లో శ్రీనివాసరావు కూడా ఉన్నారు. విచారణాధికారిగా ఉన్నందున తనను మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. దీంతో ఆయన స్థానంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవతేజను ప్రభుత్వం నియమించింది. ఆయన త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

గతంలో ఈనామ్ పకడ్బందీగా అమలు: గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన యార్డులో జరిగే అక్రమాలు, అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ-నామ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లతో తూకాలు వేయించడం, బూమ్ బారియర్ల ఏర్పాటు, వేమెన్లు తూకాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం, ఏజెంట్లు అధిక కమీషన్ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు జీరో వ్యాపారానికి అడ్డుకట్ట వేయగలిగారు. పాలకవర్గం నియామకం అయ్యే వరకు ఆయన కొనసాగారు. శ్రీధర్ చేపట్టిన కార్యక్రమాలను తర్వాత వచ్చిన పాలకవర్గాలు కొనసాగించి ఉంటే.. గత అయిదేళ్లలో అక్రమాలు, అవకవతవకలకు ఆస్కారం ఉండేది కాదు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను వినియోగించకుండా మూలన పడేశారు. ప్రస్తుతం మళ్లీ జాయింట్ కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించడంతో యార్డు ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు.



కార్యదర్శిగా ఆంజనేయులు

మిర్చియార్డు కార్యదర్శిగా ఆంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వరరెడ్డిని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఆంజనేయులు ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఉన్నారు. 1985లో టైపిస్టుగా ఆయన మార్కెటింగ్ శాఖలో చేరారు. యుడీసీగా తెనాలి, గుంటూరు, సహాయ కార్యదర్శిగా గుంటూరు, గ్రేడ్-3 కార్యదర్శిగా పొదిలి, గ్రేడ్-2 కార్యదర్శిగా గిద్దలూరు, గ్రేడ్-1 కార్యదర్శిగా మార్కాపురం, స్పెషల్‌గ్రేడ్ కార్యదర్శిగా తుని, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా రాజమండ్రిలో బాధ్యతలు నిర్వర్తించారు. నేడో, రేపో ఆంజనేయులు విధుల్లో చేరనున్నారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

గుంటూరు: డీఎస్సీ ఉచిత శిక్షణకు షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం ఈనెల 27 వరకు పొడిగించిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు మధుసూదన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 25తో గడువు ముగిసినా ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దిండి భూముల్లో సాగు మార్గాలు దండి


దిండిలో పోసిన నారుమడి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని మెట్ట భూముల్లో వేరుసెనగ తప్ప వరి సాగు చేయరు. వరి పంట అంటే దిండి పంచాయతీ రైతులు ఎరుగరు. అయితే ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పలుచోట్ల పైరు నీట మునగడంతో ఈ ప్రాంతంలో వరి నారుకు డిమాండ్ ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన దిండికి చెందిన ఓ రైతు వినూత్నంగా ఆలోచించి తన భూమిలో వరి నార్లు పోశారు. దాంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు దిండిలో వరి నార్లు ఎందుకు పోశారా? అని నోరెళ్లబెడుతున్నారు. కొంత నారు విక్రయించినా మరి కొంత అలానే ఉందని, తాను పెట్టిన పెట్టుబడి వచ్చిందని రైతు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మోటార్ల కింద నార్లు పోసి విక్రయాలు చేయాలని భావిస్తున్నట్లు రైతు తెలిపారు. దీంతో దిండి భూముల్లో సాగు మార్గాలు దండిగా ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

భార్య, మరో మహిళపై భర్త దాడి

మణికేశ్వరం (అద్దంకి), న్యూస్‌టుడే: మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన రంజాన్‌బీ, మరో మహిళపై భర్త పెదఖాసిం దాడి చేసి గాయపరిచాడు. ఎస్సై సీహెచ్.ప్రవీణ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పెదఖాసిం, రంజాన్‌బీలకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలగలేదు. భార్యను నిరంతరం అనుమానిస్తూ, మద్యం తాగి దూషిస్తున్నాడు. ఈనేపథ్యంలో ఈనెల 20న ఉదయం మణికేశ్వరం వచ్చిన అతను బూతులు తిడుతూ ఇనుపరాడ్‌తో రంజాన్‌బీపై దాడి చేసి గాయపరిచాడు. తప్పించేందుకు ప్రయత్నించిన సుబ్బాయమ్మ అనే మహిళపైనా దాడి చేశాడు. క్షతగాత్రులను బంధువులు అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తుత్తి కెమెరాలా?

బస్టాండ్లలో నిరుపయోగంగా నిఘా నేత్రాలు

చీరాల, అద్దంకి, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడంలేదు. జిల్లాలోని చీరాల, అద్దంకి, రేపల్లె బస్టాండ్లలో ఈ పరిస్థితి నెలకొంది. ఫలితంగా అనుమానితులు, ఆకతాయిలు, చోరుల కదలికలను కనిపెట్టి తక్షణం చర్యలు తీసుకునే అవకాశం లేకపోతుంది. వీటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.


చీరాల బస్టాండ్‌లో ముఖద్వారం వద్ద పనిచేయని కెమెరా

చీరాల బస్టాండ్‌లో నిత్యం వివిధ డిపోలకు చెందిన 170 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. పండగలు, ఇతర సమయాల్లో రద్దీ ఎక్కువ. చీరాల విద్య, వాణిజ్య కేంద్రం కావటంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అనేక మంది దుస్తులతో పాటు వివిధ వస్తువులు కొనుగోలుకు వస్తుంటారు. వారిలో మహిళలు అధికం. గ్రామాల నుంచి వీరు ఇక్కడకి వచ్చి కావాల్సిన సామగ్రి తీసుకొని తిరిగి వెళ్లేందుకు బస్సుల కోసం వేచి ఉంటారు. ఇటువంటి సమయాల్లో అనేక చిల్లర చోరీలు జరుగుతుంటాయి. ఈ సంఘటనల్లో నగదుతో పాటు ఫోన్లు పోగొట్టుకున్న సంఘటనలు లెక్కలేనన్ని ఉన్నాయి. కొందరు ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు పోలీసు స్టేషన్ చుట్టూ ఏం తిరుగుతాములే అని చెప్పి సర్దుకుంటున్నారు. బస్టాండ్‌లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తీసివేశారు. తరువాత పోలీసు శాఖ తరపున బస్టాండ్ ప్రవేశద్వారంతో పాటు లోపలికి వెళ్లే రెండు వైపులా ఏర్పాటు చేశారు. ఇవి పోలీసులకు అనుసంధానంగా ఉంటాయి. ప్రస్తుతం ఇవి పనిచేయటం లేదు. డిపో ఆధ్వర్యంలో కార్గో కార్యాలయం వద్ద మాత్రమే సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. ఇదొక్కటే పనిచేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈవిషయమై డీఎం జె.శ్యామలను వివరణ కోరగా ప్రస్తుతం కార్గో కార్యాలయం వద్ద మాత్రమే సీసీ కెమెరా ఉన్నట్లు తెలిపారు. బస్టాండ్ మొత్తం ఏర్పాటు చేయాలని నివేదిక పంపామని, అనుమతి వస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బస్టాండ్:	చీరాల
ప్లాట్‌ఫారంల సంఖ్య:	13
డిపోలో బస్సులు:	86
రోజూ తిరిగే కి.మీ. :	33,000
నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు :	25,000
రోజువారీ ఆదాయం :	రూ.10 లక్షలు


అద్దంకి ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో..

అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన నాలుగు నిఘా కెమెరాలు నిద్దరోతున్నాయి. 2018లో వీటిని ఏర్పాటు చేశారు. నియంత్రణ పూర్తిగా పోలీసు శాఖ చేపట్టింది. సరైన నిర్వహణ లేక పోవటంతో పని చేయడం లేదు. ఈ కారణంగా చోరులు జోరుగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొంతమంది ద్విచక్రవాహన దొంగలు తాము అపహరించిన వాటిని బస్టాండ్‌లో ఉంచుతున్నట్లు సమాచారం. సోమవారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు వెళుతున్న మహిళ సంచిలోని బంగారు హారం ఉన్న పర్సును ఇద్దరు మహిళలు కత్తిరించారు. మూడు సవర్ల బంగారు ఆభరణం ఆరోజే కొని, తీసుకెళుతున్నారు. నిఘా కెమెరాలు పని చేసినట్లయితే నిందితులను సులభంగా గుర్తించే అవకాశం ఉండేదని నిఘా విభాగం వారు వ్యాఖ్యానిస్తున్నారు.

బస్టాండ్:	అద్దంకి
ప్లాట్‌ఫారంల సంఖ్య:	10
డిపోలో బస్సులు:	64
రోజూ తిరిగే కి.మీ. :	32,945
నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు :	20,000
రోజువారీ ఆదాయం :	రూ.9 లక్షలు

రేపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో సుమారు ఆరునెలల కిందట ఏర్పాటు చేసిన ఒక సీసీ కెమెరా పనిచేయడంలేదు. దీంతో పగలు, రాత్రి సమయాల్లో ప్రయాణికులకు భద్రత కరవైందని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. రాత్రి వేళ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల వస్తుసామగ్రి అపహరణ జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలకు చెందిన సుమారు 900 మంది విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుకునేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో బస్టాండ్‌లో కొందరు ఆకతాయిలు ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన ఘటనలున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సీసీ కెమెరా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రాంగణంలో మరో రెండు, మూడు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్:	రేపల్లె
ప్లాట్‌ఫారంల సంఖ్య:	8
డిపోలో బస్సులు:	58
రోజూ తిరిగే కి.మీ. :	19,260
నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు :	5,000
రోజువారీ ఆదాయం :	రూ.6 లక్షలు


రేపల్లెలో..

పోలీసులకు వ్యాసరచన పోటీలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో సిబ్బందికి 'ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసులు అహర్నిశలు కృషి చేస్తారన్నారు. పోలీసులు తన కుటుంబంతో పాటు సమాజాన్ని కూడా కుటుంబంలో భాగంగా భావిస్తారని తెలిపారు. పోలీస్ సిబ్బందిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు,బహుమతులు అందచేయనున్నట్లు ఆయన తెలిపారు.


పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోటీలో పోలీస్ సిబ్బంది

గుండ్లకమ్మ పరిరక్షణకు చర్యలు

న్యాయస్థానం ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం ✦ పరివాహకంలో సర్వే అనంతరం హద్దురాళ్లు ఏర్పాటు


హద్దురాళ్ల వద్ద సర్వే సిబ్బంది, ఔత్సాహికులు

అద్దంకి, న్యూస్‌టుడే: జీవనది గుండ్లకమ్మ సరిహద్దు నిర్ణయం, పరిరక్షణకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈవిషయమై అద్దంకి పట్టణానికి చెందిన ఔత్సాహికులు మన్నం త్రిమూర్తులు అద్దంకి న్యాయస్థానంలో ప్రజాసంబంధ వ్యాజ్యం దాఖలు చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు అద్దంకి మండల పరిధిలోని గుండ్లకమ్మ సరిహద్దుల్ని గుర్తించే ప్రక్రియకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. రామాయపాలెం రెవెన్యూ పరిధిలో సరిహద్దులు నిర్ణయించారు. గతంలో నరసింహపురంలో రీసర్వే జరిగిన నేపథ్యంలో గుండ్లకమ్మ హద్దులు నిర్ణయించడం సులభమైంది. అద్దంకి మండలంలోని గోపాలపురం, చక్రాయపాలెం, వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం గ్రామాల సరిహద్దుల్లో రాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు సర్వేయరు శ్రీలక్ష్మి వెల్లడించారు. మొత్తం మీద 15 ఏళ్లుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి ఫలితం దక్కనుంది. నవంబరు 2వ తేదీలోపు ప్రజలు గుండ్లకమ్మ నదిలో కార్తిక స్నానాలు చేసేలా చర్యలు తీసుకుంటామని కోర్టుకు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున సహకరించాలని, సర్వే జరిగే ప్రాంతాలకు హాజరై హద్దులు చూసుకోవాలని మన్నం త్రిమూర్తులు కోరారు. ఆయనకు సహకారంగా డాక్టర్ కావూరి రఘుచంద్, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి తాళ్లూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థి లతతో ఉపాధ్యాయులు


వెంకట దీపికను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవీలత, పీడీ లలిత

వేటపాలెం, చినగంజాం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న లత, చినగంజాం మండలం మోటుపల్లి పరిధిలోని అడవీధిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారిణి రామని వెంకట దీపిక ఎంపికైనట్లు ఆ విద్యాలయాల ప్రధానోపాధ్యాయుడు ఫణి సత్యనారాయణ, పీడీ బి.లలిత తెలిపారు. ఇటీవల ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


కౌసల్య

ఏల్చూరు (సంతమాగులూరు): ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని యు.కౌసల్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కందుకూరులో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ మీట్‌లో లాంగ్‌జంప్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి, రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని 14 ఏళ్ల లోపు విభాగంలో ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థినికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.వీరేంద్రను, క్రీడాకారిణిని ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు అభినందించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు రూపలక్ష్మి

బూదవాడ (జే పంగులూరు), న్యూస్‌టుడే: మండలంలోని బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వజ్రాల రూపలక్ష్మి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21-23 తేదీల్లో సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున పోటీల్లో పాల్గొంది. జాతీయ స్థాయిలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగే పోటీల్లో జాతీయ వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఆమేరకు రూపలక్ష్మిని ప్రధానోపాధ్యాయిని జి.నాగరాణి, క్రీడోపాధ్యాయుడు ఎం.వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళ బలవన్మరణం

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : కడుపు నొప్పి భరించలేక వివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇది. పోలీసుల వివరాల మేరకు..పట్టణ శివారు దరివాద కొత్తపాలెం ప్రాంతానికి చెందిన కావూరి చిన్నస్వామిరెడ్డికి 15ఏళ్ల క్రితం కావూరిపాలెం తులసీనగర్‌కు చెందిన వరసకు మేనకోడలైన స్వప్న(32)తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ నివాసానికి సమీపంలో పాడి గేదెల పెంపకం ద్వారా పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు.. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పశువుల షెడ్డు నుంచి భార్య, భర్తలు ఇంటికి వచ్చారు. చిన్నస్వామిరెడ్డి అల్పాహారం తినడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. కుమార్తె, కుమారుడ్ని పాఠశాలకు పంపిన అనంతరం స్వప్న ఇంట్లోనే ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త గమనించి స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం బాపట్లలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకు వెళ్లాడు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స నిమిత్తం పొన్నూరులోని ఓ వైద్యశాలకు తరలించారు. శుక్రవారం ఉదయం స్వప్న చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే ఆమెను వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్చే సమయంలో తాము పెంచుతున్న ఎద్దులు బెదరటంతో ఆ సమయంలో వాటి మెడలోని తాడు చుట్టుకుని ప్రమాదం సంభవించిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంపై అనుమానం రావటంతో సదరు వైద్యశాల సిబ్బంది పొన్నూరు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న బాపట్ల గ్రామీణ పోలీసులు దరివాద కొత్తపాలెం చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి మంచాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 236 చికెన్ స్కిన్‌లెస్ - 246.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: జాతీయ రహదారి కోలలపూడి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాలపర్తి బాలకృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్సై మహ్మద్‌బాషా తెలిపారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడుకు చెందిన బాలకృష్ణ ఈ నెల 23న మోపెడ్‌పై బొల్లాపల్లి నుంచి మార్టూరు వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్న విషయం విదితమే. క్షతగాత్రుడు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడని, శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

విద్యా వికాసమే లక్ష్యంగా దీక్షారంభ్



దీక్షారంభ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంగ్రూ వీసీ శారద జయలక్ష్మీదేవి, వేదికపై ఏడీలు ప్రసూనరాణి, బేగ్, స్మిత్

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యా వికాసమే లక్ష్యంగా యూజీసీ మార్గదర్శకాల మేరకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాలల్లో దీక్షారంభ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య కె.శారదా జయలక్ష్మీదేవి అన్నారు. వ్యవసాయ కళాశాలలో దీక్షారంభ్ కార్యక్రమాన్ని ఉపకులపతి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కొత్తగా కళాశాల ప్రాంగణంలోకి అడుగుపెట్టిన మొదటి సంవత్సరం విద్యార్థులకు కళాశాల వాతావరణం, పరిసరాలు పట్ల అవగాహన కల్పించి సహచర విద్యార్థులు, అధ్యాపకులను పరిచయటం చేయటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థుల్లో బెరుకును పోగొట్టి వారు దీక్షా దక్షతలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. కళాశాల ఏడీ పి.ప్రసూనరాణి మాట్లాడుతూ పది రోజులు జరిగే కార్యక్రమంలో విద్యార్థుల పరిచయం, కళాశాలలో వివిధ విభాగాల సందర్శన, గ్రంథాలయం, హెల్త్ క్లినిక్, క్రీడా ప్రాంగణం, వ్యవసాయ క్షేత్ర సందర్శన, పూర్వ అధ్యాపకులు, నిపుణుల ప్రసంగాల ద్వారా వారి మానసిక వికాసాన్ని పెంపొందించడానికి కృషి చేస్తామని వివరించారు. విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి నవంబరు 2న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు. అంగ్రూ వ్యవసాయ విభాగ డీన్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఏడీ ఎంఎస్ బేగ్, ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఏడీ డీడీ స్మిత్, అధికారులు పాల్గొన్నారు.

నిలిచిన నీటిని తొలగించాలని ఆదేశం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని 23వ వార్డు వివేకానంద కాలనీ పార్కులో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని పురపాలక అధికారులను కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశించారు. వివేకానంద కాలనీ పార్కు అధ్వానంగా ఉన్న తీరుపై ఈనాడులో 'కళ తప్పిన ఉద్యానవనం' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. పురపాలక అధికారులతో కలిసి ఉద్యానవనాన్ని ఆయన సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ గుడారం పైకప్పు ఏర్పాటు చేయాలని, చిన్న పిల్లల ఆట వస్తువులు వినియోగంలోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఈనాడు కథనానికి స్పందన

సమస్యల వలయంలో జిల్లా కేంద్రం

మౌలిక వసతులు లేక ఇబ్బందిపడుతున్న ప్రజలు

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం బాపట్ల పురపాలికలో ఏ వార్డులో చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు దట్టంగా పెరిగి చిట్టడవులను తలపిస్తూ విష పురుగులు, దోమలకు ఆవాసాలుగా మారాయి. అంతర్గత రోడ్లు కుంగి, గోతుల పడి పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి పైపులైన్లు మురుగుకాలువల్లో నుంచి వెళ్తున్నాయి. తాగునీరు కలుషితమైతే ప్రాణాంతక డయేరియా ప్రబలే ప్రమాదం ఉందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


విజయలక్ష్మీపురంలో ఖాళీ స్థలంలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు


మురుగుకాలువలో నుంచి వెళ్తున్న పైప్‌లైన్లు

★ భీమావారిపాలెం ముక్కోణపు పార్కులో పచ్చదనం, పిల్లల ఆట వస్తువులు తగ్గిపోయాయి. గత వైకాపా పాలనలో మౌలిక వసతుల కల్పనను పూర్తిగా విస్మరించారు. పెయింటర్స్ కాలనీ పార్కులో పువ్వులు, పండ్ల మొక్కలు ఎండిపోయి పిచ్చి చెట్లు పెరిగాయి. కూర్చొనే బల్లలు విరిగి శిథిలావస్థకు చేరాయి. ప్రహరీ గేటు విరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కు స్థలం ఆక్రమణలకు గురవుతోంది. పిచ్చి మొక్కలు, తొలగించి మరలా పూల, పండ్ల మొక్కలు నాటి పచ్చదనం పెంచేలా పురపాలక అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

★ భావపురికాలనీ, డ్రైవర్స్‌కాలనీ, ఇమ్మడిశెట్టి వారిపాలెం, ఆనందనగర్‌లో చిట్టడవులు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. భీమావారిపాలెం, శృంగారపురంలో పైప్‌లైన్లు ప్రమాదకరంగా మురుగుకాలువల్లో నుంచి వెళ్తున్నాయి. పైపులు ఏ మాత్రం దెబ్బతిన్నా మురుగు నీరు కలిసి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. వార్డుల్లో రహదారులు సైతం కుంగి, గోతులు పడి దెబ్బతిన్నా కనీస మరమ్మతులు చేయలేదు. శివారు ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు అందక తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలని పురపాలక ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా పెయింటర్స్ కాలనీ పార్కు

అమరావతి రైల్వే లైన్ మంజూరుపై హర్షం

బాపట్ల, న్యూస్‌టుడే: అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇతోధిక సాయం చేస్తోందని భాజపా పట్టణాధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్ అన్నారు. అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం రూ.2,245 కోట్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని రథం బజారులో భాజపా నేతలు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అమరావతి అభివృద్ధికి కేంద్రం కట్టుబడి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల సాయం చేస్తోందన్నారు. అమరావతి నిర్మాణానికి నిధులు, రైల్వేలైన్ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

బాపట్ల: వార్డుల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని పురపాలక కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. పురపాలక సంఘంలోని 13, 16, 18 సచివాలయాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను నూరు శాతం వసూలు చేయాలన్నారు. వార్డు సచివాలయాలకు వస్తున్న ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు.

హిందూ ధర్మం ప్రపంచ శాంతిని కోరుకుంటోంది

నిజాంపట్నం: హిందూ ధర్మం ప్రపంచశాంతిని కోరుకుంటోందని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి యల్లాప్రగడ సీతాపతి పేర్కొన్నారు. సంస్థ సబ్‌డివిజన్ గ్రామ కన్వీనర్ల శిక్షణ తరగతులు శుక్రవారం నిజాంపట్నంలో నిర్వహించారు. సీతాపతి మాట్లాడుతూ హిందూ ధర్మం సనాతనమైందని ఆయన పేర్కొన్నారు. ప్రతినిధులు హేమశంకరరావు, గౌరీశంకర్, మోపిదేవి శ్రీనివాసరావు,చంద్రబాబు పాల్గొన్నారు.

పీవీపాలెంలో ఓటు నమోదు కేంద్రం

పిట్టలవానిపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ఓటు నమోదు చేసుకోవాలని మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గ్లోరియానెట్ అన్నారు. పిట్టలవానిపాలెం ఐలాండ్ సెంటర్‌లో శుక్రవారం పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2021 నవంబరు ఒకటో తేదీ ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు అందరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. తెదేపా సీనియర్ నాయకులు వెంకటపతిరాజు, కడియాల ప్రసాద్, సాంబమూర్తిరాజు పాల్గొన్నారు.

34 మంది ఉద్యోగాలకు ఎంపిక

బాపట్ల, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రక్షణ సైన్యం ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా శుక్రవారం నిర్వహించారు. మేళాకు 74 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాత, మౌఖిక పరీక్షల అనంతరం ప్రతిభ చూపిన 34 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ తెలిపారు 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

సమస్యలు ముందుగా గుర్తించండి

నగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలను ముందుగా గుర్తించాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాగు, తాగు నీటితో పాటు వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ సహకారం కావాలన్నారు. ఎంపీడీవో మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

పశుగణ సద్వినియోగం చేసుకోవాలి

వేమూరు,రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పశు పోషకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపడుతున్న పశుగణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆనందబాబు కోరారు. ఇందుకు సంబంధించిన గోడ ప్రతులను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ అధికారులతో కలసి శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ సిబ్బంది నిబంధనల ప్రకారం ఇంటింటా సర్వే చేసి పశువుల వివరాలు సేకరించాలని సూచించారు. లోపాలు జరిగితే పశు పోషకులు ప్రభుత్వ లబ్ధిని కోల్పోయే అవకాశం ఉంటుందని చెప్పారు. అందువల్ల సర్వేలో జాగ్రత్తలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి రైతు బాధ్యతగా పశుగణన చేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకుడు బెల్లంకొండ నాంచారయ్య కోరారు. రేపల్లెలో మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాసంలో తెదేపా నేత శివప్రసాద్, పశువైద్య అధికారులు పశుగణన గోడపత్రిక ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ఇంటింటికీ తిరిగి పశువుల సమగ్ర సేకరణ ప్రక్రియ జరగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, పశువైద్యులు ప్రవీణ్‌కుమార్, రోషన్‌బేగ్ పాల్గొన్నారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు


రేపల్లె: తెదేపా నేత అనగాని శివప్రసాద్ ఆధ్వర్యంలో..

కార్తికమాస ఉత్సవాలు విజయవంతం చేయాలి

బాపట్ల, న్యూస్‌టుడే: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సూర్యలంకలో కార్తికమాస ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కార్తీక మాస ఉత్సవ ఏర్పాట్లపై పురపాలక కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలు కేటాయించాలన్నారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. మహిళలు దుస్తులు మార్చుకోవటానికి తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు. సముద్ర స్నానాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా గజ ఈతగాళ్ల సంఖ్యను 15 నుంచి 25కు పెంచాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ నుంచి వంద మంది వాలంటీర్లను సిద్ధం చేసి బీచ్‌లో భక్తులకు సేవలు అందించాలన్నారు. బీచ్‌లో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగిస్తూ పారిశుద్ధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని ఆదేశించారు. బాపట్ల రైల్వేస్టేషన్, పాత బస్టాండ్ నుంచి సూర్యలంకకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సూర్యలంకలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి నెల రోజులు భక్తులకు వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా పటిష్ఠ నిఘా పెట్టాలన్నారు. డీపీవో ప్రభాకర్, ఆర్డీవో గ్లోరియా, తహశీల్దారు సలీమా, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంపీడీవో బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

చట్టాలపై అవగాహన తప్పనిసరి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : చిన్నవయస్సులోనే చట్టాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో సమాజంలో ఎదురయ్యే సమస్యలను సలువుగా పరిష్కరించుకోవచ్చని గ్రామీణ ఎస్సై మల్లారపు శ్రీనివాసరావు చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నరసాయపాలెంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు పోలీస్ స్టోరీ లఘుచిత్రం ప్రదర్శించారు. పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం

ప్రజాధనంతో నిర్మించిన సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. మండలంలో కనగాల గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తయి ఏడాది కావస్తోంది. దాదాపు రూ.35లక్షలకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకు వస్తారని గ్రామస్థులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం వీటి ఏర్పాటులో సరైన నిబంధనలు పాటించకపోవడంతో గుత్తేదారుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సకాలంలో వీటి నిర్మాణాలు పూర్తి కాలేదు. పూర్తయిన చోట్ల ఇలా అందుబాటులోకి తీసుకు రాకుండా వదిలేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా వీటిని వాడుకలోకి తీసుకొస్తుందని ప్రజలు భావిస్తున్నారు. సచివాలయ భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేలా చొరవ తీసుకుంటామని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. – న్యూస్‌టుడే, కనగాల (చెరుకుపల్లి గ్రామీణ)



సిమెంటు రోడ్డే శాశ్వత పరిష్కారం

కొల్లూరులో కేటీ కాలనీ రోడ్డు నుంచి గౌడపాలెం వద్ద తెనాలి - వెల్లటూరు ప్రధాన రహదారిలో కలిసేలా సుమారు కిలోమీటరున్నర నిడివి కలిగిన అంతర్గత బైపాస్ ఉంది. పదేళ్ల క్రితం ఈ రహదారిని చాలా వరకు సిమెంటుతో నిర్మాణం చేశారు. ఇందులో కొల్లూరు - కేటీ కాలనీ రోడ్డు నుంచి సుమారు 200 మీటర్ల మేర సిమెంటు రోడ్డు వేయకుండా వదిలేశారు. ఒక మాదిరి వర్షాలు కురిసినా ఈ మట్టి రోడ్డు నీట మునుగుతోంది. ఈ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలు వర్షం నీటిలో కనిపించకపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా ఈ గుంతలు పూడ్చే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బైపాస్ రోడ్డులో మిగిలి ఉన్న కొద్ది పాటి నిడివి కలిగిన మట్టి రోడ్డును సిమెంటుతో నిర్మాణం చేయాలని వీరు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొల్లూరు**



గోడ విరిగింది.. నీరు నిలిచింది!

రేపల్లె ఏడోవార్డు అగ్రహారం రోడ్డులో మురుగు కాల్వ గోడ పలుచోట్ల విరిగింది. వర్షం కురిస్తే మురుగు రోడ్డుపై చేరి ఇళ్ల పరిసరాల్లో తిష్టవేస్తోంది. రాకపోకలు సాగించేందుకు స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగునీరు సక్రమంగా పారుదల కాక దోమల ఉత్పత్తికి నిలయంగా మారుతోంది. వాటి కాటుకు గురైన ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఏఈ రోహిణి మాట్లాడుతూ సమస్యను పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే,రేపల్లె**




ట్రాలీ బోల్తాపడటంతో రోడ్డుపై పడ్డ ఇసుక

అదుపుతప్పి ఇసుక ట్రాక్టరు ట్రాలీ బోల్తా

చెరుకుపల్లి న్యూస్‌టుడే: మితిమీరిన వేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ చెరుకుపల్లి భాస్కర్ థియేటర్ సమీపంలోని మలుపులో బోల్తా పడింది. వేగం కారణంగా ట్రాక్టరుకు ట్రక్కుకు ఉన్న లింకు ఊడి ట్రక్కు రెండు పల్టీలు కొట్టింది. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వెళ్తున్నాయని వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పల్లపట్లలో రెవెన్యూ గ్రామసభ

నిజాంపట్నం, న్యూస్‌టుడే : పల్లపట్లలో శనివారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షకీర్‌పాషా తెలిపారు. పంచాయతీలోని ప్రజలు రెవెన్యూ సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

సద్ది కార్యక్రమానికి వితరణ

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపల్లి రామమందిరంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సౌజన్యంతో, నాగ్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్ప మాలదారుల సద్ది కార్యక్రమానికి చెరుకుపల్లికి చెందిన వ్యాపారవేత్త మర్రివాడ వెంకటప్రసాద్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని రూ.9వేల విరాళం అందించారు. శుక్రవారం వారు మందిరం వద్ద సద్ది నిర్వాహకులు కాటూరి నాగేశ్వరరావు, కాటూరి ఏడుకొండలకు నగదును అందించారు.

నేడు వేమూరులో తెదేపా సభ్యత్వ నమోదు

వేమూరు,న్యూస్‌టుడే: వేమూరులోని నియోజవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 8.30గంటలకు తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పూర్తయిన పల్లె పండగ సీసీ రహదారి నిర్మాణ పనులు

బలుసులపాలెం (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: పల్లె పండుగ సందర్భంగా ఇటీవల మండలంలోని ఆయా పంచాయతీల్లో సీసీ రహదారుల అభివృద్ధి పనులను నేతలు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. శంకుస్థాపన చేసిన చోట్ల పనులు వేగంగా సాగుతున్నాయని తెదేపా మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, సీనియర్ నేత ఎమ్మార్కే మూర్తి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పనులను వారు పర్యవేక్షించారు. బలుసులపాలెంలో ఉపాధిహామీ నిధులు రూ.15లక్షల వ్యయంతో 120మీటర్ల మేర సీసీ రహదారి పనులు ముగిశాయి. గ్రామంలోనే మరో 230 మీటర్ల మట్టి రోడ్డును రూ.31లక్షల వ్యయంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు సీసీ రహదారిగా అభివృద్ధి పరుస్తున్నామని, ఈ పనులు కూడా పూర్తికా వచ్చాయని సర్పంచి కొనకళ్ల నాగమల్లేశ్వరి తెలిపారు.

కబడ్డీ జిల్లా జట్టుకు పెదపులివర్రు విద్యార్థిని ఎంపిక

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : అండర్-14 జిల్లా బాలికల కబడ్డీ జట్టుకు మండలంలోని పెదపులివర్రు జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని పులివర్తి లిఖిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ మహబూబ్ బాషా తెలిపారు. నవంబరు 9, 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని పేర్కొన్నారు. హిందూపురంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో సూరేపల్లి వీపీఅండ్‌జీఎస్ఎం ఉన్నత పాఠశాలకు చెందిన బొర్రా గీతిక జట్టులో కీలకపాత్ర పోషించి విజేతగా నిలిచింది. ఈమేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు మంచి పేరు వచ్చిందని పేర్కొన్నారు. అన్నారు.



పులివర్తి లిఖిత

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

చెరుకుపల్లి న్యూస్‌టుడే: ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని పురస్కరించుకొని పవిత్ర వెల్‌ఫేర్ సొసైటీ పాఠశాల విద్యార్థులకు మండల స్థాయిలో శుక్రవారం నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. చెరుకుపల్లి శ్రీ శాస్త్రి మెమోరియల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 124 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


ప్రదర్శన నిర్వహిస్తున్న బాలికలు, వైద్యఆరోగ్య సిబ్బంది

పొగాకు వినియోగంతో అనర్థాలు

రేపల్లె అర్బన్: విద్యార్థి దశ నుంచే పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలు తెలుసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది సూచించారు. రేపల్లె ఉప్పూడి రోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ట్రిపుల్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. పొగాకుతో తయారీ చేసిన చుట్ట, బీడీ, సిగరెట్ కాల్చడం వల్ల మానవ శరీరంలో పాడయ్యే అవయవాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు మణిమాల, ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మురుగుకాల్వలిలా.. గింజ ఇంటికి చేరేదెలా?

పంట నష్టపోతున్నా పట్టించుకోరా?

చెరుకుపల్లి, భట్టిప్రోలు, న్యూస్‌టుడే

గత పాలకు అసమర్థ పాలన కారణంగా సాగునీరందించే కాల్వలు అస్థవ్యస్థంగా మారాయి. దీంతో ఎగువ భూముల్లో నాట్లు పూర్తైతేగానీ చెరుకుపల్లి మండలానికి సాగునీరందదు. తీరా ఎగువ నాట్లు పూర్తయి ఆగస్టు, సెప్టెంబరులో ఇక్కడ నాట్లు వేస్తే పైనుంచి వచ్చిపడే మురుగుకు లేత నాట్లన్నీ ముంపునకు గురవుతున్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు మండలంలోని సగం ఆయకట్టు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. 17,500 ఎకరాల ఆయకట్టుకు 7500 ఎకరాల్లో పైరు పూర్తిగా మునిగిపోయిందని అధికారులు లెక్కతేల్చగా పాక్షికంగా మరో రెండు మూడువేల ఎకరాల్లో పైరు దెబ్బతిందని రైతులు అంటున్నారు. అయిదేళ్లగా మురుగు కాల్వల్లో తట్టెడు మట్టి కూడా పూడిక తీయని కారణంగా వానలు ఆగి నెలరోజులు గడిచినా ఇంకా కొన్ని చోట్ల పొలాల్లో మురుగు అలాగే ఉంది. ప్రధాన మురుగు కాల్వలైన ఆర్ఎం, ఓల్డుకోర్సు, కావూరు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటికాడతో పూడిపోయి మురుగు ముందుకు కదలని పరిస్థితి. అధికారులు మురుగుకాల్వలు ఆధునికీకరించి ముంపు సమస్య ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. భట్టిప్రోలు మండలంలో భారీ వర్షం కురిస్తే అద్దేపల్లి బాడవ పొలాలు మునుగుతున్నాయి. పొలాల్లోని నీరు బయటకు పోయే మార్గం లేక రైతులు నష్టపోతున్నారు. ఈ పొలాల్లో నీరు మురుగు కాల్వ ద్వారా గంగోలు డ్రెయిన్లోకి కలుస్తుంది. కాల్వ మొత్తం గుర్రపుడెక్కతో నిండటంతో నీరు స్తంభిస్తోంది. రెండు వేల ఎకరాల్లో దాదాపు 1500 ఎకరాల వరకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రెండోసారి నాట్లు పొలాల్లో నీరు చేరింది. ఈ విషయంపై ఆ శాఖ ఏఈ కల్యాణ్‌బాబు మాట్లాడుతూ కాల్వ పరిస్థితి పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.


చెరుకుపల్లి: గుర్రపుడెక్కతో కావూరు డ్రెయిన్ పరిస్థితి


భట్టిప్రోలు: మురుగు కాల్వలో పేరుకున్న గుర్రపు డెక్క

పింఛన్ల పంపిణీపై సమీక్ష

చెరుకుపల్లి: నవంబరు 1న నిర్వహించాల్సిన పింఛన్ల పంపిణీపై ఎంపీడీవో షేక్ మహబూబ్ సుబానీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. 1వ తేదీనే నూరుశాతం పంపిణీ జరిగేలా విస్తృత ఏర్పాట్లలో భాగంగా మండలంలో 9895 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 175 మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం): విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎంఈవో ఉయ్యూరి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఖాజీపాలెం జడ్పీ పాఠశాల శుక్రవారం తనిఖీ చేశారు. ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆయన తెలిపారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

జి.ఎన్.పాలెం(పిట్టలవానిపాలెం): గోకరాజు నల్లిబోయినవారిపాలెం పంచాయతీలో సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆధార్ శిబిరాన్ని సందర్శించారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

కర్లపాలెం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెం సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు

దాహార్తి తీర్చడానికి వెళ్లి.. ఇసుకలో ఇరుక్కుపోయి


మంచినీటిని వదిలేస్తున్న ట్యాంకరసిబ్బంది

ఇటీవల కురిసిన వర్షాలకు మూలపాలెం జగనన్న కాలనీలోని అంతర్గత రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారాయి. దీంతో శుక్రవారం మంచినీరు తీసుకెళ్తున్న 4వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మున్సిపల్ ట్యాంకరు కాలనీ మొదటి లైను చివరి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఇసుకలో చక్రాలు కూరుకుపోయాయి. నీరు ఉండటంతో స్థానికులు కొంత మేర బిందెల్లో, డ్రమ్ముల్లో పట్టుకున్నప్పటికీ ట్రాక్టర్ బయటకు రాలేదు. చేసేది లేక డ్రైవర్ ట్యాంకర్‌లోని నీటిని బయటకు వదిలేయటంతో అసలే చిత్తడి చిత్తడిగా అంతర్గత రోడ్లు మురుగునీటి తటాకాలను తలపించాయి. గత ప్రభుత్వం రహదారులు నిర్మించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని ప్రజలు ఆవేదన చెందారు. -న్యూస్‌టుడే, బాపట్ల పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? పట్టణంలోని 18వ వార్డులోని రామమందిరం వీధిలో ఉన్న సందీప్ పాఠశాల దగ్గర నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు వీధి దీపాలు ఒక్కటీ వెలగడంలేదు. వారం రోజులుగా ఇదే పరిస్థితి. దీంతో రాత్రులు ఇబ్బందిగా ఉంది. **- నాగేశ్వరరావు, స్థానికుడు**

✔ వెంటనే సిబ్బందిని పంపి అక్కడ దీపాలు బాగుచేయిస్తా. **- అబ్దుల్ రషీద్, కమిషనరు, చీరాల పురపాలక సంఘం**

చీరాల అర్బన్, న్యూస్‌టుడే:

నిల్వ నీరు తొలగింపు

స్పందనకు వందనం

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాల ఆర్చి వద్ద సిమెంటు రోడ్డు పల్లంగా ఉంది. దీనిపై ఇటీవల కురిసిన వర్షపు నీరు చేరింది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై ఈనాడు దినపత్రికలో 'మేమున్నాం.. మీకుతోడుగా'లో గురువారం ప్రచురితమైంది. స్పందించిన చినగంజాం ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బందితో నీటిని బయటకు పంపి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

27 నుంచి రోటరీ యువజన వారోత్సవాలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు తెలిపారు. తొలి రోజున చెస్, 28న దేశభక్తి, స్ఫూర్తి గీతాలు, 29న వికసిత్ భారత్-2047పై చిత్రలేఖనం, 30న అంతరిక్ష సాంకేతికతలో భారతదేశ ప్రగతి, ఉపయోగాలు, రోటరీ చతుస్సూత్రాలు, వాటి ఉపయోగాలు, హరిత రాజధాని అమరావతి అంటే అర్థం, ఉపయోగాలపై ఎలక్యూషన్, 1న ఫ్యాన్సీ డ్రెసెస్, 2న క్విజ్, 3న డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు జరుగుతాయని చెప్పారు. అన్ని పోటీలకు ఆరు నుంచి పదోతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఒక్క ఫ్యాన్సీ డ్రెసెస్ పోటీలకు మాత్రం అయిదో తరగతిలోపు చిన్నారులు మాత్రమే అర్హులని వెల్లడించారు.

హమ్మయ్య తీగలు సరిచేశారు

వేటపాలెం, న్యూస్‌టుడే: జాండ్రపేట నుంచి అక్కాయిపాలేనికి వెళ్లే దారిలో కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలను సిబ్బంది సరిచేసి పైకి కట్టారు. 'ఈనాడు'లో 'చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు' అనే శీర్షికతో కథనం శుక్రవారం వెలువడింది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రచురితమైంది. దీనికి స్పందించిన గ్రామీణ విద్యుత్తు ఏఈ భాస్కర్, తన సిబ్బందిని అక్కడ పంపించి వాటిని సరిచేయడంతో ఆ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సరిచేసిన విద్యుత్తు తీగలు

ఈనాడు కథనానికి స్పందన

రహదారికి మరమ్మతులు

ముప్పవరం(జే.పంగులూరు), న్యూస్‌టుడే : ముప్పవరం-జే పంగులూరు రహదారికి మరమ్మతులు చేపట్టారు. గతనెల 18న ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన అడుగుకో గుంత..అవస్థలు అన్న కథనానికి ర.భ.శాఖ అధికారులు స్పందించారు. రూ.40 లక్షల వ్యయంతో ముప్పవరం నుంచి జే.పంగులూరు గ్రామం అంచు వరకు మరమ్మతులకు టెండర్లు పిలిచారు. రహదారి దెబ్బతిన్న ప్రదేశంలో మరమ్మతులు జరిపించనున్నట్లు ర.భ. శాఖ ఏఈ శ్రీమన్నారాయణ తెలిపారు.

కాలువలు అసంపూర్ణం.. పూర్తవ్వని అనుసంధానం

వేటపాలెం, న్యూస్‌టుడే

'అంతర్గత భూగర్భ కాలువల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది... ఉన్న వాటిని అనుసంధానం చేయలేదు... గృహాల్లో వాడుక నీరు పారుదల లేక ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. కొన్ని చోట్ల రహదారులపైకి చేరుతోంది... దీంతో ప్రజలకు ఇక్కట్లు.. దోమల విజృంభణతో అవస్థలు.. ఇదే సమయంలో దుర్వాసన.. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండల కేంద్రమైన వేటపాలెం పంచాయతీలో భూగర్భకాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. 2019 డిసెంబరులో రూ.3 కోట్లతో దాదాపు 13 పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సమయంలో కరోనా విజృంభించడంతో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. దీంతో ఈ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఆ తరువాత నిధుల విడుదలలో నెలకొన్న జాప్యంతో పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. సుమారు రూ.కోటి విలువ చేసే పనులు పూర్తి చేశారు. దీనికి గుత్తేదారుడికి సుమారు రూ.75 లక్షల వరకు బిల్లులు చెల్లించారు. అంతే ఆనాటి నుంచి వీటి గురించి ఎవరు పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదు నెలలు గడిచింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



రైల్వేస్టేషను రోడ్డులో రహదారిపై పారుతున్న మురుగునీరు

వేటపాలేన్ని వదలని మురుగు సమస్య

నిలిచిన మురుగు

చిన్నబజారు, గొల్లపూడివారి వీధి, రైల్వేస్టేషను రోడ్డు, పంచాయతీ కార్యాలయం, బండ్ల బాపయ్య జూనియర్ కళాశాల, రోటరీ క్లబ్ రోడ్డులలో కాలువల నిర్మాణం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల స్థానికులు ఈ అవస్థలు పడలేక గుంతలు పూడ్చి వేశారు. దీనివల్ల కాలువల అనుసంధానం పూర్తి కాలేదు. గృహాల్లో వినియోగించిన నీరు కాలువల్లోకి వదలడంతో పారుదల లేక దుర్వాసన వస్తోంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటంతో దోమల ఉద్ధృతి పెరిగి, రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆయా ప్రాంత ప్రజలు అంటున్నారు. కాలువపై మూతలు వేయాల్సి ఉండగా అక్కడక్కడ మాత్రమే వేశారు. ఇక సర్వోదయ కాలనీ, రైల్వేస్టేషను రోడ్డు, నాయునిపల్లి పోలేరమ్మ దేవాలయం పక్కగా కాలువ నిర్మాణానికి గుంతలు తీసి అలాగే వదిలేశారు.



రూ.ఆరు లక్షలతో నిర్మించినా..

కాలువల్లో ఉన్న నీరు బయటకు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో తాత్కాలికంగా ఆ సమస్య పరిష్కరించేందుకు ఏడాదిన్నర క్రితం రూ.6 లక్షలతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. వీటిని మురుగు కాలువ మధ్యలో నిర్మించారు. ఆ సమయంలో నీరంతా వీటిల్లోకి ఇంకిపోయింది. గృహాల్లో నీరు నిరంతరం వాడకం వల్ల గుంతల్లో నీరు ఇంకడం నిలిచిపోవడంతో సమస్య యథాస్థితికి వచ్చేది. ఇప్పటికే పలుచోట్ల మురుగునీరు రోడ్డుపై పారుతోంది. మరికొన్నిచోట్ల అలాగే రోజుల తరబడి కాలువల్లో నిల్వ ఉండటంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు తోడించేందుకు చర్యలు చేపట్టాలని గృహస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్జీలు స్వీకరించి.. సమస్యలు పరిష్కరించి

ఎమ్మెల్యే ఏలూరి 'ప్రజాదర్బారు'కు పోటెత్తిన జనం



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, న్యూస్‌టుడే: వైకాపా అయిదేళ్ల పాలనలో సమస్యలను గాలికి వదిలేసి అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. మండలంలోని ఇసుకదిబ్బ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 'ప్రజాదర్బార్' నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా వందలాది మంది ప్రజలు విచ్చేసి తమ ఎదుర్కొంటున్న తిష్టవేసిన సమస్యలను ఏలూరికి వినతిపత్రం రూపంలో అందజేశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి ఎమ్మెల్యే చొరవ చూపారు. అయిదేళ్ల ప్రభుత్వంలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని, తామంతా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిన ప్రభుత్వంపై పోరాడిన [illegible] గుర్తుచేశారు. చినగంజాం మండలం మోటుపల్లి సముద్రమార్గ రవాణాకు అనుకూలంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సంబంధిత అధికారులు ఇక్కడకు వస్తారని ఏలూరి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తాము కొల్లేరు భూ సమస్యలను పరిష్కరించాలని వినతులు అందజేశారు. ఈనాం భూములను పరిష్కరించి తమకు భూహక్కు పత్రాలు అందజేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, జనసేన నాయకుడు విజయకుమార్, వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంతోమంది పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 28 మందికి రూ.21.51 లక్షల నగదు చెక్కులను సీఎం సహాయ నిధి ద్వారా ఏలూరి పంపిణీ చేశారు.

ఉత్సాహంగా ప్రతిభ పాటవ పోటీలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ పాటవ పోటీలు చీరాలలో ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం గాయత్రి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోటీలను ప్రధానచార్యుడు వి.వి.ఫణీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఇంటర్నెట్' వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మిరియాల హనుశ్రీ, వెంకట సాత్విక్, కారుణ్య ప్రీతి కైవసం చేసుకున్నారు. వీరికి జ్ఞాపికలతో పాటు ప్రశంసపత్రాలను 'ఈనాడు' తరపున పాఠశాల ప్రతినిధులు అందజేశారు. విద్యాలయం డైరెక్టరు జెట్టి ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు జి.సంధ్యారాణి, రజనీకుమారి, కె.రాధమాలతీ ఉన్నారు.



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు



బహుమతులు అందుకున్న విజేతలతో పాఠశాల ప్రతినిధులు

బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణ సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహ నిరోధ చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీవో సుధ, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, న్యూస్‌టుడే: ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వివరించి, అభిమానులు ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకునేలా చేసి సభ్యత్వ నమోదు ప్రక్రియలో చీరాల నియోజకవర్గం ముందంజలో ఉండేలా కృషిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమం సన్నద్ధతలో భాగంగా శుక్రవారం రాత్రి పార్టీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లు, క్లస్టర్ బాధ్యులు, యూనిట్ బాధ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకుంటే వచ్చే ప్రయోజనాలు వివరించాలని సూచించారు. కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరికీ పార్టీ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అందరిని కలుపుకొని దీన్ని విజయవంతం చేద్దామని సూచించారు. సజ్జా హేమలత, నాసిక వీరభద్రయ్య, పురుషోత్తం, జనార్దన్, చంద్రమౌళి, రజని తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

సంతమాగులూరు: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం సంతమాగులూరు మండలంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఏల్చూరులోని మంత్రి అతిథి గృహంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న తెదేపా సభ్యత్వ నమోదు ప్రారంభంలో మంత్రి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు వైద్య సేవలు

కారంచేడు, న్యూస్‌టుడే: మండలంలోని కుంకలమర్రులో శుక్రవారం అంగన్‌వాడీ చిన్నారులకు కారంచేడు పీహెచ్‌సీ వైద్యుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంటుకు ఎంపిక

చీరాల, న్యూస్‌టుడే: కడపలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మ్యాట్‌బాల్ క్రికెట్ టోర్నమెంటుకు ఎంపికైన విద్యార్థుల అభినందన సభ శుక్రవారం పేరీరా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ సుప్రసన్న మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న తేళ్ల పృథ్వీరాజ్, డి.బంగారిబాబు, పేర్లి సంతోష్, గంట అఖిల్‌సన్ని, డి.జాన్సన్‌లు రాష్ట్రస్థాయి టోర్నమెంటులో పాల్గొనటం హర్షణీయమన్నారు. అక్కడ మంచి ప్రతిభ చూపి విద్యాలయానికి పేరుతేవాలని ఆకాంక్షించారు. వ్యాయామోపాధ్యాయులు శాంతి వరప్రసాద్, విజయలక్ష్మి, అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉద్యోగ మేళాలో 43 మందికి అర్హత

ఇంకొల్లు, న్యూస్‌టుడే: స్థానిక దగ్గుబాటి విద్యాసంస్థలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీసీఆర్ఎం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 43 మందికి ఉద్యోగార్హత సాధించారు. ఐసీఐసీఐ బ్యాంకు, ఎక్స్ సొల్యూషన్స్, కర్ణాటక బ్యాంకు, సెలెక్ట్ గాడ్జెటాస్ లిమిటెడ్, అపెక్స్ సొల్యూషన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 107 మంది హాజరయ్యారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికార ప్రతినిధి ప్రణయ్, జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్, పర్చూరు ప్రాంతీయ స్కిల్ హబ్ సమన్వయకర్త వినోద్‌కుమార్, కళాశాల డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




ధ్రువపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

వలపర్ల వెళ్లాలంటే ఒళ్లు హూనమే!

వలపర్ల(మార్టూరు), న్యూస్‌టుడే: మార్టూరు మండలంలో ప్రధాన వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతున్న వలపర్ల చేరుకోవాలంటే అవస్థల ప్రయాణం తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. వస్త్ర, బంగారం, నేత పరిశ్రమలకు ప్రసిద్ధిగాంచిన వలపర్లకు వివిధ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు, విక్రయదారులు సరకు కొనుగోలుకు వస్తుంటారు. కొన్నాళ్లుగా ఈ గ్రామానికి చేరుకునే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. జాతీయ రహదారిపై ఉన్న కోనంకి నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే అద్దంకి నుంచి వ్యాపార కార్యకలాపాలకు వలపర్లకు రావడం సహజంగా మారింది. ఈపరిస్థితుల్లో ఇరువైపులా ఉన్న రహదారులు బీటీ లేచి, గోతులమయంగా మారాయి. సాగర్ కాల్వ వద్ద మలుపునకు తోడు రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ఈప్రాంతంలో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఈ మలుపు వద్ద చిలకలూరిపేటకు చెందిన యువకుడు ద్విచక్ర వాహనం అదుపుతప్పి దుర్మరణం చెందిన సంఘటన ఇప్పటికే ప్రజలు మరువకున్నారు. అలాగే మలుపులో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో పలువురు క్షతగాత్రులయ్యారు. కోనంకి నుంచి వలపర్లకు సుమారు నాలుగు కిలోమీటర్లు ఉండగా ఈ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఈవైపు రాకపోకలకు హడలెత్తుతున్నారు. కనీస మరమ్మతులు, నిర్వహణ కరవై బీటీ రోడ్డు గోతులమయంగా మారింది. అంచులు కోసుకుపోయి ప్రమాదాలకు నెలవైంది. ఇప్పటికైనా అధికారులు దీని అభివృద్ధికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సాగర్ కాల్వపై రక్షణగోడ లేని మలుపు



తారులేచి, గోతులమయంగా మారిన వలపర్ల రహదారి

టెట్ కటాఫ్ మార్కులు సవరించాలని వినతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) కటాఫ్ మార్కులు ఓసీ-90, బీసీ-75, ఎస్సీ-60లుగా నిర్ణయించారని, దీనివల్ల చాలా మంది అభ్యర్థులు ఒక్క మార్కు తగ్గినా అర్హత సాధించలేకపోతున్నారని చీరాలకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి మురళీమోహనరావు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం పంపారు. ఈ పరీక్షకు కులాలతో సంబంధం లేకుండా ఉత్తీర్ణతకు మార్కులు కేటాయిస్తే ఎందరికో ఉపయోగంగా ఉంటోందని పేర్కొన్నారు.

ఎస్సైలు బాధ్యతల స్వీకరణ

చీరాల అర్బన్: చీరాల మొదటి పట్టణ పోలీసు స్టేషన్‌లో కొత్తగా కమాలకర్, భాస్కరరావులు ఎస్సైలుగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మారీడు శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా వీరు కలిశారు. వీరిద్దరూ వీఆర్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

బైటమంజులూరు(జే పంగులూరు): మండలంలోని బైటమంజులూరులోని వివాదాస్పద స్థలాన్ని తహసీల్దార్ పి.సింగారావు శుక్రవారం ఉదయం పరిశీలించారు. గ్రామానికి చెందిన వ్యక్తి 15 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించాడంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అద్దంకి: ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు అందించిన సమాచారం మేరకు పట్టణంలోని గుంజివారిపాలేనికి చెందిన ఎ.హనుమాయమ్మ(47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. రెండురోజుల క్రితం కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతుడి భర్త తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పంట నష్టం నమోదు ప్రారంభం

ముప్పవరం(జే పంగులూరు), న్యూస్‌టుడే: వర్షానికి దెబ్బతిన్న పంటల నమోదు ప్రక్రియను ఏవో డి.సుబ్బారెడ్డి పరిశీలించారు. జే పంగులూరు మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. తదనుగుణంగా రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది బృందాలుగా మారి పంట నష్టం వివరాలు నమోదు చేస్తున్నారు. ఈనెల 27వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో నమోదు పూర్తవుతుందని, 28 నుంచి నవంబరు 2వ తేదీ వరకు సామాజిక తనిఖీ కోసం ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యంతరాలు పరిశీలించిన అనంతరం మూడో తేదీన ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. పరిశీలనలో స్థానిక నేతలు కుక్కపల్లి ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శంఖు, చక్ర, నామాల వార్షికోత్సవం

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ నగర్‌లో శంఖు, చక్ర, నామాల తొలి వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. కాలనీవాసులంతా ఏకతాటిపై నిలిచి వేడుకలు జరిపారు. సంప్రదాయంగా శాంతిహోమం, శ్రీనివాసకల్యాణం, ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. 20వ వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, తెదేపా నేతలు గుంజి గోవిందు, వెంకట్రావు తదితరులు నేతృత్వం వహించారు. అనంతరం అన్నదానం జరిగింది.



శ్రీనివాస కల్యాణంలో దంపతులు

పశుగణన ప్రారంభం



పశుగణన గోడపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్ మోహనరావు తదితరులు

అద్దంకి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 120 రోజుల పాటు ఇంటింటికీ పశుగణన జరుగుతుందని అద్దంకి పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.మోహనరావు అన్నారు. స్థానిక పశువైద్యశాల వద్ద 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించిన గోడపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ అద్దంకిలో 11వేలు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లోని గ్రామాల్లో 81 వేల పశువులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అన్నారు. శుక్రవారం నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ గణన కొనసాగుతుందన్నారు. 14 మందిని నియమించామని చెప్పారు. పశువులు, జంతువులు, పక్షుల వివరాలను వాటి యజమానులు తమ సిబ్బందికి అందించాలని చెప్పారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, గుణాత్మక విద్య బోధించాలని చీరాల ఉప విద్యాధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బల్లికురవ, కొణిదెన జడ్పీ ఉన్నత పాఠశాల, బల్లికురవ కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠ్యప్రణాళికలు సక్రమంగా ఉంచుకోవాలని, విద్యార్థుల హాజరు ఎప్పటికపుడు పరిశీలించుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్థులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బల్లికురవ మండలం ఎస్ఎల్.గుడిపాడు సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో కుసుమకుమారి పరిశీలించారు. ఆధార్ నవీకరణ జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

మోదేపల్లి(అద్దంకి), న్యూస్‌టుడే: కాలానుగుణంగా ప్రజలకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.శ్రీహర్ష అన్నారు. మోదేపల్లి సచివాలయం వద్ద స్థానికులతో మాట్లాడారు. అధిక వర్షాల కారణంగా డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కె.అనిల్, అద్దంకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాకానిపాలెం(అద్దంకి): ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కాకానిపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి హేమమాధురి అన్నారు. కాకానిపాలెం సచివాలయం వద్ద మురుగు కాలువల్ని ఆరోగ్య సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. డయేరియా ప్రబలే అవకాశం ఉన్న లార్వాను పరిశీలించారు.

సద్వినియోగం చేసుకోండి

మేదరమెట్ల: మండలంలోని అన్ని సంపద తయారీ కేంద్రాలను పంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. మేదరమెట్లలోని చెత్త నుంచి సంపద తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. కార్యదర్శి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం పరిశీలన: ఆధార్ నవీకరణలో భాగంగా మేదరమెట్లలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో రాజ్యలక్ష్మి పరిశీలించారు.

ఐదుగురికి గాయాలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. ఈపురుపాలెం పోలీసు పోలీసుల కథనం ప్రకారం... రామకృష్ణాపురానికి చెందిన చట్రాసి వెంకటేశ్వర్లు దంపతులు రామాపురం వెళ్లారు. అక్కడ నుంచి స్కూటీపై ఇంటికి తిరిగి వస్తున్నారు. వీరి వాహనాన్ని వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వీరిని విజయవాడ తరలించారు. భార్య పరిస్థితి విషమంగా ఉంది. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

★ వాడరేవు-చీరాల రోడ్డులో ఉన్న వాకవారిపాలెం వద్ద స్కూటర్‌ని టిప్పర్ శుక్రవారం రాత్రి ఢీకొట్టింది. దీంతో ముగ్గురు మత్స్యకారులకు గాయాలయ్యాయి. వీరిలో రాము, రమణలకు తీవ్ర గాయలు కాగా వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు పంపారు. మరొకరు సురేష్‌కి ఏరియా వైద్యశాలలో చికిత్స చేస్తున్నారు.

మద్యం స్వాధీనం

యద్దనపూడి: జాగర్లమూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రవిచంద్ర నుంచి శుక్రవారం 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు అబ్కారీ సీఐ భుజంగరావు తెలిపారు.

రెవెన్యూ అర్జీలకు పరిష్కారం

ధర్మవరం(అద్దంకి), న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరంలో జరిగిన రెవెన్యూ గ్రామసభకు ప్రజల నుంచి భారీగా స్పందన లభించింది. నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన సభకు ఆర్ఐ. రామారావు(శంకర్) అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ పరంగా ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే అర్జీ రూపంలో సమర్పించుకోవాలన్నారు. వీటిన్నింటినీ సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఉప తహసీల్దార్ సురేష్‌బాబు, వీఆర్వో విజయకుమార్, సర్వేయరు శ్రీలక్ష్మి, తెదేపా నేత చాగంటి రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

చింతగుంపల (చినగంజాం), న్యూస్‌టుడే: చింతగుంపల పంచాయతీ కార్యాలయంలో రీసర్వేలో ఉన్న సమస్యల పరిష్కారానికి సంబంధించి గ్రామసభ శుక్రవారం జరిగింది. 36 అర్జీలు రైతుల నుంచి అందాయని డీటీ తెలిపారు. వీఆర్వోలు ఆమంచి సత్యనారాయణ, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్చూరు, యద్దనపూడి: గ్రామాల్లో రీ-సర్వే పూర్తయి ఇంకా సమస్యలు నెలకొంటే సదస్సుల్లో పరిష్కరించుకోవాలని పర్చూరు, యద్దనపూడి తహసీల్దార్లు బ్రహ్మయ్య, రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయా మండలాల్లోని గొల్లపూడి, జాగర్లమూడి గ్రామాల్లో రీ -సర్వేపై సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. డీటీ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

సత్కారం

వేటపాలెం: పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దర్జీ, పౌరాణిక నాటక కళాకారుడు ఎస్ఎం షరీఫ్, చిత్రకారుడు గుడిమోటి శేఖర్‌లను సత్కరించారు. ప్రత్తి వెంకట సుబ్బారావు, లక్ష్మీప్రసాదు పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన

సిఏయుపి స్కూల్ వల్లాపల్లి బల్లికురవ మండలం బాపట్ల జిల్లా నందు ఖాళీగా వున్న ఎయిడెడ్ పోస్టుల భర్తీకి కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, అమరావతి, ఆంధ్రప్రదేశ్ వారి మెమో నెం. ESE02-20/09/2024-PS-CSE Dt: 25-09-2024 మరియు G.O.M.S. No. Education Dated 01-01-1994 మరియు జిల్లా విద్యాశాఖాధికారి, ఒంగోలు, ప్రకాశం జిల్లా వారి ఉత్తర్వులు ఆర్.సి.నెం. 4938/c2/2023 తేది: 23/10/2024 వారు అనుమతి ఇచ్చియున్నారు. ఈ నేపథ్యంలో పై తెలిపిన పాఠశాలకు కరస్పాండెంట్ ఈ పాఠశాలలో ఈ క్రింది తెలిపిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల పోస్టు భర్తీకి పూర్తి అర్హులైన అభ్యర్థుల నుండి 3 సంవత్సరముల తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానించడమైనది.

S.No.	Name of the post	Number of posts to be filed	Roster Points	Qualification
1.	SGT	01	OC (6/100)	D.Ed., & TET

వయోపరిమితి ప్రస్తుతం ఉన్న నియమ నిబంధనల ప్రకారం మరియు GO.M.S. No.11 School Education (Ser-1) Dept., Dated: 12/02/2024 & Go. Ms No. 22 School Education (Services.1), 6th March, 2024 అభ్యర్థులు అన్ని ధృవీకరణ పత్రాలు (అకాడమిక్ & ప్రొఫెషనల్స్) ఫోటో కాపీతో తేది: 24-10-2024 నుండి తేది: 13-11-2024 లోపు స్కూల్ కరస్పాండెంట్ గారికి వ్యక్తిగతంగా గాని, పోస్టు ద్వారా గాని లేదా ఆన్‌లైన్ https//cse.ap.gov.in/aided recruitment notification ద్వారా దరఖాస్తు చేసుకొనవలెను. దరఖాస్తుదారులందరీ ఏకీకృత జాబితా ప్రచురణ తేది నాడు జిల్లా విద్యా శాఖాధికారి పోర్టర్‌లో మరియు పాఠశాలలో ప్రచురించబడును. పరీక్ష విధానం ఆన్‌లైన్ గాని లేదా ఆఫ్‌లైన్‌లో గాని ఉండును. అర్హత కలిగిన అభ్యర్థులు జాబితాను ప్రచురణ తేదీని తెలియజేయబడును. పరీక్ష తేదీని ప్రకటించబడును.

చిరునామా: పి.సునీల్‌కుమార్, కరస్పాండెంట్
caup స్కూల్, వల్లాపల్లి, బల్లికురవ మండలం
ప్రకాశం జిల్లా-523 260